పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

౧

"అబ్బాయి నెత్తుకోవాలి"

"తెల్ల వారిందా?"

"గంటయిం దప్పుడే"

"ఏడిసినట్టుగానే వుంది జవాబు; తొరగా రా"

"అక్కడ కాపరం వుంటా ననుకున్నా రా యేమిటండీ?"

"ఆశమ్మలూ బోశమ్మలూ చేరతారు కాదూ మరి?"

"అయితే?'

"కబుర్లు మొదలు పెట్టకుండా బ్రవంచుకని రమ్మంటున్నాను"

"నేను మొదలు పెట్టను లెండి"

"వాళ్లు మొదలు పెడితే అందుకుంటావా?"

"మీరు వద్దన్నా రా మరి?"

"ఇప్పు డంటున్నాను. ఎవర్నీ పలకరించకు. ఎవరేనా పలకరిస్తే పలక్కు"

"పలికేదాకా పలకరిస్తే?"

"అంత ఆవసరం యేం వచ్చిందని అడుగు"

"దాని పే రేమిటో?"

"నీ మొఖం... .."

"మొఖం కడుక్కోండి యింతట్లో వస్తాను"

"ఇదిగో యిదే చెప్పడం. ఇవాళ తొరగా వంట కావాలి"

"ఏమి టా తొందరా?"

"రాత్రి యెలా భోంచేశానో జ్ఞాపకం వుందా?"

"అయితే నేను వచ్చాటప్పటికి పొయ్యిలో నిప్పు వెయ్యండి"

"ఇల్లలక్కుండా నే?"

"అంత తొందర కైతే యెలాగా మరి? అంతకీ వల్ల కాకపోతే పొయ్యిమట్టుకు పామెయ్యండి"

౨

"ఏం వండుతా వీ పూట?"

"ఏం వండ మన్నారూ?"

"ఇంటో యేం వున్నాయీ?"

"దొండకాయలు పండిపోయేలాగ వున్నాయి కోసుకరండి"

"వెధవదొండకాయలు వద్దంటూంటే తగలేశావు పాదు"

"అరిటిపువ్వు వండనా?"

"ఛీ"

"మునగాక్కతెండి ఆషాఢమాసం వెళ్లిపోకుండా"

"అంతకంటే గడ్డి నయం"

"దానిమీద అంత కోరికవుంటే అదేతెండి పోనీ"

"..........…."

"పోనీ మీకు గోంగూరా పప్పూ వెయ్యనా?"

"నీకో?"

"ఉల్లి పాయల___"

"ఎన్నిమాట్లు బుద్ధి చెప్పినా అవి మానవు. ఎవరేనా విన్నా చూసినా తలవంపులు"

"ఏం మునిగిపోయిం దేమిటికి?"

"నువ్వు రాకపూర్వం యీ యింటిలో వుల్లిపాయ లెవరేనా యెరుగుదురా?"

"నేను కాపరానికి వచ్చిన కొత్తరికం మీయమ్మ చాలామాట్లు వండిపెట్టారు నాకు"

"అక్కడ అలవాటనీ"

"ఎలా ఐతే నేమీ? మీయమ్మ వండి పెట్టారు"

"తెలిసింది. నీకోసం వండింది మాఅమ్మ"

"నాకోసమే. కాదన్నా నా రేమిటి నేను? ఎవళ్లేమయిపోయినా సరే నేను మానలే నండీ అవీ"

"దిక్కుమాలిన అలవాటుకాని పుట్టింట యెలా యేడ్చినా___"

"సుఖ మల్లె నిండింటో కూచుని అలా యేడ్పులు పెడబొబ్బలూ తెచ్చిపెట్టుకుంటా రెందుకూ? మీనోట్లో శని వుంటే మీరు మానెయ్యండి అవి తినడం. నేను మానలేను. మానను"

"వాట్లని తినవచ్చు నని యేశాస్త్రంలో వుంది?"

"శాస్త్రాలెవరి క్కావాలీ? పోడుం పీల్చ మని దేల్లో వుం దేమిటికి?"

"............"

"మాట్లాడరేం? ఎవళ్ల అలవాటు వాళ్లదీ. ఏవూరు పద్ధతి ఆవూరుది. మీ కీ పట్టింపు లెక్కడ వచ్చాయో గాని యీవూళ్లో అంతా తింటారు"

"రహాస్యం"

"మీరూ రహాస్యంగానే తినండి. మునిగిపోయిం దేమిటికీ?"

3

"ఏమట్టుకు వచ్చింది వంట?"

"అన్నం వార్చాలి"

"ఇంకా అక్కడే వున్నావూ?"

"అన్నట్లు మరిచిపోయి తీరా మడికట్టుకున్నాను. బియ్యం కొలిచి పట్టుకురండీ"

"ఇంకా యెసట్లో బియ్య మేనా పొయ్య లేదా యేమిటే?"

"ఎసరు కాగితేనా ?"

"మరి వార్చా లన్నా వేం ?"

"అత్తిసరు మెతుకులు తినడం నావల్ల కాదు సుమండీ"

"ఛా! బుద్ధి లేనిదానా!"

"ఆలా రుంజుకుంటూ వెళ్లిపోతే కాదు మరి, దాసీపీనుగు అంట్లు పట్టుకు వెళ్లి చెరువుదగ్గిరే కూచుంది తొరగా రమ్మనండి వెళ్లి"

"యెస రేనా పెట్టలేదా యేమిటే?"

"గిన్నెలు లేందే నన్నేం చెయ్యమంటారండీ?"

"పొయిలో నిప్పేనా వేశావా?"

"ఇప్పుడే కాదుటండీ పొయ్యలికానూ? కాస్తేనా ఆరాలా అక్కర్లేదా? ఇంతకీ యెక్కడదొరికాయో గాని మీకు చెక్కపేళ్లు, పచ్చిముద్దలు. బుడ్డిడు కిరసనాయిలు పోసినా తగులడ్డం లేదు"

"ఏమీ లేందే మడి కట్టుకున్నా వెందుకూ మరీ?"

"చద్దన్నం తినకుండా నేనుండలేను బాబూ?"

౪

"ఏం చేస్తున్నావూ?"

"మీ రేం చేస్తున్నారూ?"

"ఏమి టా మాట?"

"ఏం లోటు వచ్చిం దేమిటి?

"నాకర్మమూ నీయోగమూనూ. అయితే అయింది గాని యెవరూ వచ్చారుట మన యింటికి?"

"మామరిది వచ్చి యిప్పుడే వెళ్ళాడు. ఎంతోసేపు కనిపెట్టుకున్నాడు మీకోసం పాపం"

"ఏ మరిదీ?"

"మా లచ్చి మొగుడు. సుందరం"

"వున్నాడా వెళ్లాడా?"

"వుండడాని కెలాగా పాపం? ఇంటికేవెళ్ళాడు"

"ఏం పనిమీద వచ్చాడూ?"

"ఈవేళకి మూడోనాడు సత్యనారాయణవ్రతం చేసుకుంటారట వాళ్లు. పిలవడానికి వచ్చాడు"

"సరే; ప్రయాణం కాబోలు"

"మాన్తా ననుకున్నారా యేమిటి లేకపోతే? రేపు పొద్దున్న వాళ్లు మన యింటికి రావాలా?"

"వెళ్ళకపోతే నువ్వేడుస్తావు. వెడితే నే నేడవాలి. కాస్తేనా ఆచారమా వల్లకాడా? ఆగుడ్డలతో తింటాడు నానాగడ్డీనీ"

"ఏం మృదువైన నోరూ? అంత యేడుస్తూ వెళ్లడం యెందుకూ మీరూ? యింటో కూచోండి అత్తిసరు వేసుకు తింటూను. ఎవళ్ళేమైపోయినా సరే, నేను మాత్రం వెళ్లకమానను. అంత ఆచారమే కావలిస్తే మీరు మా చిన్న మరిదిగారింటికి వెళ్లండి. ఆవుపేడ కలిపి మరీ యిస్తుంది కాళ్లు కడుక్కోడానికి నీళ్లు వాళ్ళమ్మ."

"కానైతే యిరవై యేళ్లవాడే గాని బాపన్నని చూడూ యెంత ఆచారంగా వుంటాడోనూ? బ్రాహ్మణ జన్మ యెత్తినందుకు అలా___"

"చెప్పబోయి చెప్పబోయి బాపన్నే చెప్పాలి దిక్కుమాలిన రూపం యెక్కడ వచ్చిందోగాని కారు నలుపూ, మసిబొగ్గు నయం. ఆరూపానికి తోడు వల్లమాలిన చేదస్తం కూడానూ"

"నలుపూ యెరుపూనా యేమిటి లెక్క? అతగాడు మొగంనిండా వీభూది పెట్టుకుని కూచున్నాడంటే_"

"అయ్యో అందం! ఏజన్మలో చేసుకున్నామో నేనూ మావెంకీ. పాపం చేసుకొని పుట్టాం. లేకపోతే మాకర్మం యిలా కాలదు"

"ఎప్పుడూ సుందరం కోసమే యేడ్చావు. చేసుకున్న పెళ్ళామేనా యింతగా కొట్టుకోదు"

"ఆడదై పుట్టేక అతన్ని చూసి ఆనందించకుండా యెవత్తి వుండగలదూ? చంద్రవంక లాంటి నుదురూ, తుమ్మెదరెక్కల్లాంటి క్రాపింగుజుట్టూ__మీసాలు తీసేసుకుంటాడు కనక మరీ ముద్దొస్తూ వుంటుందా మొగం. ఇక కంఠం యెత్తి పద్యం చదివాడంటే కిన్నెరలు మోగిపోవూ?"

"చాలించు యీపాటికి. యెవళ్లైనా వింటే తలవంపులు కూడానూ"

"తలవంపుల కేమి కర్మం వచ్చిందీ? అందంగావుంటే యెవర్తి మరిదిని యెవర్తి మెచ్చుకోకుండా వుండగలదూ? మీరూపం విరూపాక్షరూపం అయిపోయినందుకు విచారించక అతగాడంటే అలా రుంజుకుంటారేం? నావాళ్లనంటే నే నూరుకోను నాచెల్లెల్నంటే వొకటీ నామరిదినంటే వొకటీనా?"

"మరి నువ్వు బాపన్ననెందు కన్నావూ?"

"అనకపోతే ముద్దెట్టుకుంటాను పాపం, మిమ్మల్నీ అతన్నీని. వీభూది మాననునీ, క్రాపింగు పెట్టుకోమనీ, చొక్కాలు తొడుక్కోమనీ, తొరగా తొరగా పని చేయించుకుంటూ వుండమనీ, దిక్కుమాలిన పొగాకుతో తమలపాకులు నవలడం మానమనీ, మాచెల్లెలు చిలక్కి చెప్పినట్లన్నివిధాల చెపుతూ వుంటే కాస్త నూనగూడనూ అత్తనూ? అంత నిర్లక్ష్యమా?"

"అలాచేస్తే యేడిసినట్టుగానే వుంటుంది సరసం"

"అతని సరసం మీరన్నట్లుండడం చేతనే అదీ నాలాగే సుందరాన్ని చూసి ఆనందిస్తూ వుంటుంది. అతనేనా పాపం మేమంటే ప్రాణం యిస్తాడు. మొన్న పిల్లాడి బారసాల కిట్టే వెళ్ళాటప్పటికి మూడువేల మల్లి పువ్వులు తెచ్చాడు ప్రత్యేకంగా మాముగ్గురికీనీ. చెల్లెళ్ళకిద్దరికీ చెరోవెయ్యీ తెచ్చాడు, అందమూ చందమూ అతనికి తెలిసిన ట్లెవరికి తెలుసునూ? బండైతే కుదుపని యిట్టె మోటారు కుదిర్చి పంపించాడు మాశారు కామూ మమ్మల్నీ? మేం కోరిన చీరలు తెచ్చాడు పాపం. మధ్యమధ్య మా లచ్చే ధుమధుమ లాడుతూ వుంటుంది కాని నెత్తిమీద పెట్టుకుంటాడు మమ్మల్నతను"

"చాల్లే యీపాటికి సందకం"

"వినలేకపోతే చెవులు మూసుకోండి మీరు"

"వినా లేనూ మీ వేషాలుకూడా చూడా లేనూ. ఇక అత్తగాడితో వేళాకోళా లాడిచూడు చీల్చేస్తాను నిన్ను"

"ఏమిటే? ఎల్లుండి వెడతాను కాదూ? చేతనై తే రండి చీలుద్దురుగాని. నామీద మీరు చెయ్యి చేసుకున్నా రంటే వూరుకుంటాడేం అతనూ? మీ కేం విషం పెట్టాడనీ అత్త నంటే ఆలా వుడికి పోతారూ? అతను పలకరిస్తె మొగం అలా ిప్పుకుంటూరు. ఏమీ? మొగం చెల్లకా? కొరి: దెయ్యంలాగ పుట్టినందుకు మూలపడి మూలుగుతూ కూచో లేక యింకా ఇ:డిసిపడతారేం? చాల్లెండి నేర్చుకుపోయూరు. పాదుకళ్లు మిటమిటలాడి పోతాయి యేంపాపమో గానీ. మొన్న మాచెల్లెలితో సరిగ్గా మాటే వ్లేకపోయూరుట మీరు. ఏం చేసిం దదీ? మావెంకి కొప్పు మా నేసి జారుముడి వేసుకుంటే మీ కేం పోయిందీ? నిక్షేపం లాగ మా సుందరం వూ రందర్నీ పిలిచి, చిన్న కార్యం అయినా భోగం మేళం పెట్టి ముచ్చటగానూ, వైభవంగానూ కొడుక్కి బారసాల చేసుకుంటూ వుండగా_మాలచ్చి అతనికి తగ్గ వేషం వేసుకుని పీటలమీద కూచుని వుండగా___కొప్పులు పెట్టుకునీ, మడికచ్చాలు పోసుకునీ, మూసివాయినపు ముత్తైదువుల్లాగ తిరగమా అతని యెదుట మేమూ? చూసినవాళ్లు గడ్డిపెట్టరూ? మీరంత చూడలేకపోతే యే వీధి అరుగు మీదేనా కూచోలేకపోయూరా? వూరుకోండి యీపాటికి. అనాధలాగ యింట్లో కూచోక వంట అయిందాకా యెక్కడికేనా వెళ్లిరండి"

"వోసి నీయిల్లు వల్లకాడు గానూ! నాకెక్కడ దాపరించావే నువ్వూ?"

"ఇంకా గబగబా నడిస్తే బాగుంటుంది ....నన్నంటే నే నూరుకుంటూనేం? అబ్బో చెలిగేస్తాను. నాకు పిసాళం యెత్తుకొచ్చిం దంటే మొగుడయ్యాది దేవుడయ్యాది తూర్పారబట్టేస్తాను......అన్నట్టు మరిచి పోయూను. కంసాలిదుకాణంమీదికి వెళ్ల మనవలిసింది... ... ఇప్పుడైతే యేమీ? ఈవెళ్లడం వెళ్లడం అక్కడికి వెడితే సరేసరీ; లేకపోతే వెళ్లేదాక అన్నమే పెట్టనూ"

౫

"ఇదిగో, ఓయ్! ఏం చేస్తూన్నారూ? ఎక్కడికి వెళ్లేరమ్మా యింతట్లోనూ? ఎక్క డున్నారండీ?"

"............"

"వెడితే వెళ్లారు. కాస్త తలుపు చేరవేసి వెళ్ల కూడదూ? కుక్క చొరబడితే యేంచేస్తురో? ఇదిగో. ఓయ్! మాట్లాడరేం? లేరు. ఎక్కడికో దాటారు ఏమండోయ్?"

"............"

"ఏకోటయ్యశాస్తుర్లు దగ్గిరికో, ఏపళ్లం భొట్లు దగ్గిరికో వెళ్లి పోసుకోలు కభుర్లు చెప్పుకుంటూ కూచోడమే కానూ? పూర్వపువాళ్లు ఆమట్టి కాస్తా సంపాదించి వుండకపోతే ఈ ప్రయోజకత్వానికి తాగడానికి గంజేనా లేకే పోవును. దిక్కుమాలిన సమ్మంధం తెచ్చి పెట్టిందమ్మా మాఅమ్మ నాకూ? ఏమండోయ్!"

"వచ్చె వచ్చె. ఎందు కాబొబ్బలూ?"

"బొబ్బలా? వంటయిందాకా తొండలు విడిపించారు. ఇంతట్లోకే వెళ్లాలా పెత్తనాలికీ?"

"నేను పెత్తనాలికి వెళ్లేనో కంసాలిదుకాణం మీదికి వెళ్లేనో తెలుసునా నీకు?"

"దుకాణంమీదికి వెడితే వెళ్లాటప్పుడు నాతో చెప్పారా? ఏం, అంత రహస్యమేమీ? అస లెక్కడికో బయలుదేరారు. అవతలివాళ్లు కనబడకపోతే దుకాణం మీద కూచున్నారు కామోసు"

"ఎలాగయితే యేం? నీపనే చూశానుగాదూ?"

"చూశారే యెలాగయితేం. ఏదీ? కంటె, యేమట్టుకు వచ్చిందీ?"

"వంటయిందా?"

"కంటెమాట చెబుదురూ"

"మెలికలు వేశాడు"

"మొన్న నే వేశా డన్నారుకాదూ?"

"ఇవాళ సాఫు చేస్తున్నాడు"

"ఎప్పుడిస్తా నన్నాడూ?"

"తొరగానే యిస్తాడు. వంటయిందా?"

"ఎల్లుండి మా చెల్లెలిగారి యింటికి వెళ్లాలి ఇవ్వాలని చెప్పారా?"

"తొరగా భోజనం పెడితే వెళ్ళి అక్కడే కూచుంటాను"

"గోజూ పెట్టడం లేదా యేమిటి?"

"స్నానం చెయ్యమంటావా?"

"తొరగా యివ్వాలని చెప్పి వస్తురా వెళ్లి!"

"భోజనం చేశాక వెళ్లనూ?"

"ఈలోపున మరో పని చేస్తాడు"

"చెప్పి వస్తే మానాడా?"

"అదేమిటండీ దేవతలికి పంచాంగం చెబుతారూ? ఒక్కమాటు వెళ్లి రండి, అంతట్లో పులుసు పోసుస్తాను"

"పులుసుజోలి నాకెందుకూ? నేనేం తింటానా చేస్తానా?"

"ఇందాకా వొప్పుకున్నారు కాదుటండీ?"

"ఏడిశావు"

"మన కెప్పుడూ యేడుపులూ పెడబొబ్బలూనూ నాకు వస్తువుచేయించవలసి వచ్చాటప్పటికి నవనాడులూ కుంగిపోతాయి. ఆడదాన్ని యిన్నివిధాల యేడిపించాక యిక యెంత చదువుకుంటే యేమిటే?"

"ఇప్పుడేం లోటు చేశానూ? కంటె —"

"తీరా కంసాలికి బంగారం యిచ్చిపోయా నని యేడుపూ. చాల్లెండి నేర్చుకుపోయారు. చూసిచూసి వస్తువు చేయించా లేరు. పెట్టుకుంటే రెండుకళ్లతోటే చూడాలేరూ. ఇంత కుచ్చితబ్బుద్దీ, విషపుకళ్లూ యెక్కడా చూడలేదూ"

"దిక్కుమాలిన దండకానికి మొదలూ. ఛా! నీబతుక్కాలా"

"నాబతు కెందుకు కాలాలీ? మీవాళ్లంతా యేమైపోయారూ! నన్నన్నా రంటే బాగా జరగదు"

"నోరు మూసుకో యెవళ్లేనా వినిపోతారు"

"వింటే నాకేం భయమా? ఎవళ్లేనా తీసుకు రండి. గడ్డి యెవళ్లకి పెడతారో చూస్తాను"

"ఏమిటే?"

"కోమటే, కొత్తబెల్లమూనూ. నే నేం తప్పుమాట అన్నాననీ అలా కళ్లెర్ర చేసుకుంటారూ?"

"......................"

"ఇంకా చూసుకోండి కోరచూపులు. ఇంటో కూచుని ఆడదానిమీదే కాదూ అఘాయిత్యం చెయ్యడమూ. వీధిలోకి వెడితే గజగజలే"

"ఏమిటే యీ అల్లరీ?"

"అదే నేనూ అడుగుతున్నాను. ఒక్కమాటు దుకాణంమీదకి వెళ్లి రమ్మంటే యింత రవ్వా?"

"ఇప్పుడే కాదూ అక్కణ్ణుంచి వచ్చానూ?

"ఇక్కడే కాదూ దుకాణం? మలుపు తిరగాలి ఇంతేనా? అదిగో సుత్తిదెబ్బలు వినపడుతూనే వున్నాయి. కంటె కంత గట్టిగా సాగకొట్టడానికేం వుందీ? మీరిలా మొగం తిప్పడంతోటే దాని నలా పారేశాడు. విచారించకండి. అది యింతట్లో నా మెళ్ళోకి రాదులెండి"

"నువ్వు మనిషివా దున్నపోతువా?"

"ఏలాంటివాళ్ల కలా కనబడతాను"

౬

"అభిషురించాను"

"అఘోరించలేక పోయావు"

"పీటమీదకి వచ్చాటప్పటికి వస్తాయి రుసరుసలు. తిన్నగా కూచుని తినడం చూడలేదు నేను"

"ఆకులో యేం పెట్టావూ తినడానికీ? "

"నన్నేం చెయ్యమంటారూ? నిక్షేపం లాంటి పులుసు పనికిరాకపోయె............"

"ఇంకేమీ లేదూ వండడానికీ?"

"అదా యిదా అని అడిగితే గడ్డనీ, చెత్తనీ, తుక్కునీ, సూకరాలు పోయారు గాని ఫలానా వండమని చెప్పారా?"

"ఇంకేమీ లేదూ వండడానికీ?"

"ఏం తెచ్చి పెట్టారూ మీ రింట్లో?"

"పెండలం యేమైపోయిందీ?"

"దాని మొఖం మండేరి. రుచా పచా? ఇంతకీ పెండలం పెండలం అనడమేగాని ఛెల్ల మేదీ?"

"ఆవ పెట్టరాదూ?"

"మీకేం చెబుతారు. పదిరోజుల కిందట మా తమ్ముడు వచ్చినప్పుడు నాలుగు ముక్కలు వేయిద్దామని యిట్టే తరిగాను. ఇంకా పోలేదు దురదలు. ఎక్కడో రాక్షసిపెండలం తెచ్చారు."

"దొడ్లో తోటకూర వుంది కాదూ?"

"ఛా! చీడ పట్టలేదూ?"

"కాడలో?"

"ముదిరిపోలేదూ?"

"పప్పుపులుసు వండరాదూ?"

"రెండు పులుసు లెందుకూ?"

"వుల్లిపాయలు మానేస్తే"

"మీ కేం, చెబుతారు"

"నీకూ నాకూ గూడా పనికివచ్చేవి అనేకా లుండగా—"

"ఏం వున్నాయీ? కాకరకాయ చేదూ. దొండకాయ విషం. పొట్లకాయ గబ్బు. వంకాయ పైత్యం. కంద వేడి. అరటికాయ అరగదు. బీరకాయ మొఖం మొత్తింది. ఆనపకాయ నిరుచప్పన. గుమ్మడికాయ పడదు ఏం అట్టే పెట్టారూ వండడానికీ? ఎంతసేపూ పెండలమూ పప్పుపులునూ. దానిమొఖం కాల్చెయ్య. పెండలం దురదగదా? పప్పుపులుసులో వొక్క వుల్లిపాయ ఐనా అడ్డం వెయ్యనివ్వరు కదా?"

"............"

"పీటమీద కూచుని అంతా జపం చేసుకుంటారు. మీ కెక్కడ దాపరించాయమ్మ యీలిట్లూ యీతిమ్మలునూ?"

"రేపణ్ణుంచి నేను వొండుకుంటాను నువ్వు కూచుని తిను"

"వో! ఇంతకంటేనా? మూడ్లో మేలు"

౭

"చాప వేస్తున్నా రెందుకూ?"

"వొక్కకునుకు........."

"దుకాణం మీదకి వెళ్లరూ?"

"క్షణంలో లేవనూ?"

"అన్నం పెట్టేదాకా నిలవనిచ్చారుకారు. నాలుగు మెతుకులూ వొంటపట్టేటప్పటికి పెద్దమ్మ ఆవహించింది"

"నువ్వు పెట్టిన పంచభక్ష్యపరమాన్నాలూ తినేటప్పటికి"

"ఇలాంటి మొఖాలికే అలాంటివి"

"..............."

"రాత్రి తెల్లవార్లూ నిద్రపోవచ్చు. వేషాలు వెయ్యక దుకాణం మీదికి వెళ్లండి"

"శంభులింగం భోజనం చెయ్యాలా?"

"మీకు మల్లే గోళ్లుగిల్లుకుంటూ కూచోడతను ఈపాటికి దుకాణం తెరుస్తాడు వెళ్లండి"

"వెళ్లి తిండి తిను. నువ్వు లేచాటప్పటికి నేనూ లేస్తాను"

"దానికీ దీనికీ సమ్మంధం యేమిటే?"

"నీ నగల వుబలాటమేనా నాకష్టమూ సుఖమూ చూడడం వుందా?"

"దుంగ లెత్తేనా దూలాలెత్తేనా? పొడుం పీల్చుకుంటూ కూచోడమే కాదూ అక్కడ?"

"..................."

"లేవరేం?"

"..................."

"వినపడదూ?"

"...................."

"మిమ్మల్నే. ఏమండోయ్! ఇలా చూడండీ"

"...................."

"పడుకోవద్దు. ఇదే చెప్పడం"

"...... ...."

"మానరు కాదూ? వెళ్లరూ"

"ఇంత మొండి కెత్తితే యెలాగమ్మా వేగడం"

"......................."

"ఇంతేనా యింతకంటె యేమేనా చేస్తారా? ఇదిగో ఓయ్! నల్లరాయీ! ఏమండోయ్! మిమ్మల్నే. వెళ్లనని చెప్పడానికేనా నోరులేదూ?"

"...................."

"నాకు జవాబు చెప్పకుండా యెలా నిద్రపోతారో చూస్తా కాదూ? మొండివాడు రాజుకంటే బలవంతుడుట. పెళ్లామనీ, బిడ్డలనీ, అచ్చటనీ, ముచ్చటనీ, మంచనీ, చెడ్డనీ యేమేనా తెలుస్తేనా? పెళ్లాడగానే సరా? వెర్రివాడికి పెళ్లాం వొస్తే గిల్లిగిల్లి చంపాడుట. మానాన్న వొద్దుమొర్రో అంటూంటే మాఅమ్మ తగలపెట్టిందీ సమ్మంధం. అనుక్షణమూ దాని జీవానికి పడి యేడుస్తూనే వున్నాను నేను. రామరామా! బెల్లంకొట్టిన రాయిలాగ పలక్కపోతే యింకేమిటీ చెయ్యడం? అసలీవంశమే యిలాంటిదీ. తాతముత్తాతల దగ్గిర్నుంచీ వస్తోందిట పెళ్ళాన్ని యేడ్పించడం యీదిక్కుమాలిన యింటో. లోకంలో అనేకమంది వున్నారుగాని యింత కొయ్యతనం యెక్కడా లేదూ. చెవిటివాడి ముందర శంఖం వూదితే దాన్ని కొరకడానికి నీతరమా నీయబ్బతరమా అన్నట్టుంది యీసడసం. అయ్యో! సిగ్గు బిడియమూ లేకపోతే సరీ. ఎన్నన్నా దున్నపోతుమీద వాన కురిసినట్లే"

"వోసి నీయిల్లు—"

"మీయిల్లే. మీబతుకే. అదేదో మీకే"

"నోరు మూస్తావా ముయ్యవా?"

"మీచేతు లేదేవుడికి మీదు కట్టుకున్నారూ?"

"...................."

"ఇప్పుడేనా లేవండి మించిపోలేదు"

"పడుకోనివ్వవూ?"

"కంటి చేయించరూ?"

"...................."

"నామాట వినండి. ఇవాళా రేపూ కష్టపడితే కంటి అయిపోతుంది. తరవాత మీయిష్టం వచ్చినంతసేపు నిద్రపోవచ్చు. మళ్లీ శిస్తులు వచ్చేదాకా దావుగళ్లీ కోసం తొందర పెట్టను. వేసంగిలో పుస్తెల నాను చేయిస్తానని మీనోటితో మీరేఅన్నారుకాదా? పదిరోజులాలస్యమైనా దానికోసం తొందర పెట్టను. లేవండి"

"వొక్కక్షణం నిద్రపోకపోతే తలనొప్పివస్తుందే"

"మళ్లీ అదే మాట"

"వూరికే పడుకున్నానని పేరూ. నువ్వుఅన్నం తిని వచ్చాటప్పటికి యిక్కడ వుంటే అడుగు"

"మీరు వెళ్లాకే తింటాను నేను అన్నం"

"వోసి నీపట్టుదల—"

"అయ్యో మీమొండితనం—"

"నన్ను వేపుకుని తినకు. నీకింతేనా పుణ్యంవుంటుంది. ఇంటోకి వెళ్లు"

"నాపుణ్యం బుగ్గయింది కనకనే మీయింటో పడ్డాను. నాకిలాంటి యోగం వుండడంచేతనే నెత్తిమీద పెట్టుకునేవాళ్లు యెందరు వచ్చినా మాఅమ్మ వాళ్లనందర్నీ కాకని నాగొంతు కోసింది. అసలు పెళ్లిలోనే రోత పుట్టింది నాకు; పొడుంబుర్రా, సిలకజుట్టూ చూశాటప్పటికీ"

"...................."

"మీకే చెప్పడం, వినపడదూ?

"...................."

"అయింది. ఇక దీపాలు పెట్టాకే కళ్లు తెరవడం. కుంభకర్ణుడి అంశ అంతా పట్టింది. 'మంచి మనిషికో

మాటా, మంచి పశువు కో దెబ్బా' అన్నారు. మనిషి జన్మం యెత్తగానే సరా?"

"ఇందాకణ్ణుంచి చూస్తున్నాను. వొక్క-మాస్తరుగానే తోడేస్తున్నావు పేగులు. నాకెక్కడ దాపరించావే నీమొగం కాలా......దుకాణంమీదే పడుకుంటాను వెళ్లీ. తన్నుకు చావు"

"నాకేం చచ్చీదాకానూ. మా కుటుమ్లో అర్థాయుష్యపీనుగు లెవరూ లేరు. మమ్మల్నన్నవా ళ్లెవళ్లూ ముందుకు రాలేదు. ఇదిగో చెబుతున్నాను. అప్పలమ్మని పంపి కనుక్కుంటాను. అక్కడేనా సరే నిద్రపోయారంటే రాత్రి మీరు వండుకోవలసిందే అన్నం, వెళ్ళండి. మీ వేషాలు సాగనిస్తా ననుకున్నారు పాపం"

౮

"కంటి పని కట్టిపెట్టించారా యేమిటి?"

"అలా అన్నావేం?"

"అప్పుడే వచ్చారేం?"

"రాకూడదూ?"

"అడక్కూడదూ?"

"మంచినీళ్లేనా తాగవద్దుటే?"

"మొదటే అలాగ చెప్పరాదూ?"

"ఇంతట్లో యేం మించిపోయిందీ?"

"వొక్క క్షణం వూరుకుంటే సరీ తెలుసును."

"ఏడిశావు."

"ఏమిటే! మహా చురుగ్గా వుంది యివాళ వ్యవహారం"

"చాలించు. కసిన్ని మంచినీళ్లు పట్టుకొనిరా"

"కూచోండి కాస్సేపు"

"ఏం? వర్షం వచ్చిందా యేమిటి?"

"వర్షం వుంటే మీరే బాధపడతారు కడుపునొప్పితో నాకేం?"

"మరి యింకెందుకూ ఆలస్యం"

"వక్కక్షణం కూచోండి"

"కంఠం ఆరుకుపోయి యింటికి వస్తే కూచోమంటా వేమిటే?"

"అప్పలమ్మ రావాలి"

"నా మంచినీళ్లకీ అప్పలమ్మకీ సమ్మంధం యేమిటే?"

"అంతానూ"

"అదేమిటే నీ మొఖం మం—"

"మాటలు మిగిలా రంటే వూరుకోను. మీరక్కడ కూచుని నిద్రపోయారో లేదో తెలవకుండా మంచినీ ళ్లెలా యిస్తా ననుకున్నారూ? దిగండి గుర్రం"

"వోసి నీబతుక్కాలా! యింత మొండి కత్తా వేమిటే యివాళా? దెయ్యం పట్టిందా యేమిటే?"

"దెయ్యమో భూతమో మిమ్మల్నే పట్టింది. మీరీవేళ బండ కత్తితే నేను మొండికెత్తనూ! గోళ్లు గిల్లుకుంటూ దుకాణం మీద కూచోడానికే మీ కంత కష్టమైతే చాకిరీ అంతా చెయ్యడానికి నాకెంత కష్టంగా వుండనూ? మీరు నా బతుక్కాలా లంటే నేను మీ సిగ్గు చిమడా లననూ?"

"నువ్వే యివ్వా లన్న మాట యేమిటే? నేనే తెచ్చుకుంటాను వెళ్లీ"

"తెచ్చుకోండి నాకేం భయమా? పొయ్యిగూడా అలికేస్తే సంతోషిస్తాను. చివరి కెలాగా అది మీమీదే పడుతుంది యివాళ. ఇదిగో. దుకాణం మీదకి వెళ్లి వచ్చిన గుడ్డలతో ముట్టుకుంటారు కామోసు నిండుబింది. మళ్లీ ఆచారానికి పట్ట పగ్గాలుండవు. ముట్టుకోండి. నాకేం? రాత్రికి అవే మంచినీళ్లు......నూతికి వెళ్లారు. కావాలి శాస్తి. పరుగెత్తలేక బలాదూ రన్నట్లు కోపం అంతా చేదమీద చూపిస్తున్నారు. నాకేం? పగిలిపోతే పుచ్చినట్లు తామే తెచ్చుకుంటారు మళ్లీనీ. ఈశీను గెక్కడికి వెళ్లిందో గంటయింది వెళ్లి......"

* * * *

"సిగ్గు లేకపోతే సరీ నవ్వడానికి"

"చేతగాని పని చేసుకున్నందుకు మీరు సిగ్గుపడాలి గాని నాకేం?"

"సాగుతోంది ఆంధ్రబ్బ. ఎందు కెందు కని వూరుకుంటూంటే నె త్తెక్కుతున్నావు"

"కాళ్లకింద బెట్టి రాసేద్దా మని వుంది కామోకు పాపం. అబ్బో! మీతాతలు దిగి రావాలి. ఇంక రెండేళ్లు పోనివ్వండి అబ్బాయి నప్పగిస్తాను"

"వాణ్ణి కూడా పాడుచేస్తావు నువ్వు. కాస్త నిర్భాగ్యుడున్నాడు. అప్పుడే వుల్లిపాయలు మప్పేశావు"

"మీ నోట్లో శని వున్నాడు కనక తినడానికి మీకు యోగం లేదు. వాడి కేం? వుల్లిపాయలు కాక పోతే నల్లవుద్ధరి తినండి మీరు నాకేం? శుభం అంటూ పిల్లాణ్ణి తిట్టుకుంటా రేమిటే? పాడునోరూ. పెళ్లిపందిట్లో కూచుని తద్దినమ్మంత్రా లేకరువుపెట్టే రకం. మా నాన్న పేరుపెట్టా నని యీ వుక్రోషం అంతానూ. రానివ్వండి మా నాన్నని చెబుతానూ"

"దిక్కున్న చోట చెప్పుకో"

"ఏమిటే? ఏం చూసుకునీ ఆ భరవసా యివాళా? ఈగుడ్డతో వండుతా నుండండీ. యీరాత్రిమీరు వండుకుంటే వచ్చి ముట్టుకుంటాను కూడాను. ఆదిక్కేమిటో అప్పుడుగాని తెలవదు. తొందర పడకండి. వో! ముక్కు బారెడు చేసుకుంటేనూ మూతి ముడుచుకుంటేనూ నాకు భయంలేదు. వెళ్లండి వుద్ధరిస్తారా యేమిటి?"

౬

"తలుపు తెలుపు"

"............"

"ఏం చేస్తున్నావూ, వినపడమూ?"

"............"

"వోయ్ ఇదిగో నిన్నే. ఎక్కడున్నావూ?"

"............"

"ఇంటో వుందా యెక్కడి కేనా వెళ్లిందా? కోపం వస్తే వొళ్లు మండబెట్టుకుంటుంది. మడి కట్టుకుందో లేదో. అనాచారరోగం వచ్చి పడిందిగాని అమృతంలా వుంటుంది యేం వండినానూ. కోపం రానంతసేపూ ప్రాణం యిస్తుంది కాని ఆ మంచి మాత్రం యెంతోసేపు వుండదు. కోపం యెలా వస్తుందో, యెందుకు వస్తుందో, యెప్పుడు వస్తుందో తెలవకుండా వచ్చి గజగజ లాడిం చేస్తుంది......ఎక్కడున్నావూ! వినపడమూ? వోయ్! లోపలే వుంది గొళ్లెం. యేం చేస్తూ వుందోగానీ అబ్బాయీ"

"............"

"నాయనా"

"......"

"బుల్లేడా!"

"......"

"కుర్రాడా!"

'......"

"రామచంద్రం!"

"......"

"దిక్కుమాలిన కర్మం కోపమో వినబడకపోవడమో. ఏం—చే—స్తు—న్నా—వూ?"

"ఎందుకా బొబ్బలూ?"

"తలుపు తియ్యి, ఎక్కడికి పోయావూ?"

"ఎవళ్లతోటేనా లేచి పోయా ననుకున్నారా యేమిటి?"

"ఏం చేస్తున్నా వంటే యేమి టా దిక్కుమాలిన గొడవా?"

"మాట్లాడితే దిక్కుమాలడ మేమిటే? పలక్కపోతే కాస్సేపు అరుగుమీద కూచోకూడదూ? అయితే అయింది మడికట్టుకోంకి త్వరగాను"

"ఏం?

"ఏం యేమిటి?

"ఏ మంటున్నాను"

"తెలిసింది. ఏం యేమిటి?

"నేను మడి కట్టుకోవడం యెందుకూ?"

"ఇందాకానే చెప్పాను"

"అంతే?"

"ఒక్క దెబ్బని"

"నిద్రపోవడం నిజమే. కాని శంభులింగం పని మానలేదు. నమ్ము"

"కనక గొడవలు పెంచక తొరగా వంట కానివ్వండి. వినండి"

"నిజం చెప్పినా నమ్మవూ?"

"నిజాని కెక్కడికీ? అన్నివిధాల బతిమాలినా మీరు వినగలిగేరా?"

"బుద్ధి తక్కువ వచ్చింది. నేను నిద్రపోయినా అతను పని మానలేదు"

"మీరు చూశారా?"

"మేలుకున్నంతసేపూ—"

"సరే. అప్పుడుకూడా కళ్లు మూసుకుపోవాలా యేమిటి? పోనీ యెంతసేపు నిద్రపోయారో చెప్పండి"

"క్షణం. అరగంట కంటే యెక్కువ లేదు"

"దానికి శిక్ష మీరు రెండుగంటలు పొడుం పీల్చకుండా వుంటారా?"

"చంపే వన్నమాట"

"ఏం? అంత నొప్పిగా వుందా? ఇందాకా నేనెంత బాధపడ్డానో. ఒళ్లు మండుకుపోయిందే. కాస్తైనా జాలేసిందా మీకు? నయాన్ని భయాన్ని—ఎంత చిలక్కి చెప్పినట్లు చెప్పినా గిజా అన్నారు గాని విన్నారా?"

"అలా అనుకోకు. కొంచెం శాంతించు. వుండివుండి ఒక్కొక్కమాటు చర్రుమంటూ వుంటావు; గాని లేకపోతే నీయంత మంచిది లేదు. దిక్కుమాలిన ఆచారం దగ్గిర వస్తోంది నీకూ నాకూ జగడం"

"ఆచారం దిక్కుమాలిందని తెలిసివుండినీ్న అవంటే అలా—కడుపు మాడ్చుకుంటా రెందుకూ?"

"స్మార్తమ్ముక్కలు చెప్పుకోవడంచేత అలా అలవాటైపోయింది. మీనాన్న యింగ్లీషు చెప్పించక పోయె. నాకు మరో వృత్తి చేతకాకపోయె"

"ఈయిల్లు తెగనమ్ముకొని సుందరంగారి వూరు పోదాం పదండి. వాళ్ల యింటిపక్క నున్న డాబా అమ్మకానికి వచ్చిందిట. సుందరాన్ని బతిమాలి తన బట్టల వర్తకంలో మీకు వాటా యిప్పిస్తాను పదండి"

"నువ్వంతదానవు కాదని కాదు. ముందు సంగతి అలా వుంచు. నేనునిన్ను తిట్టినా—ఆ తిట్లు హృదయం లోనుంచికాదు—ఏదో ఒళ్లు మండి—నాదీ తొటాకు మంటే. ఒక్క క్షణం నిద్ర పోయాను; గాని నువ్వు కంటికి పెట్టుకుని కలకల్లాడుతూ—నువ్వుందంగా వుంటే అది నాకు ముచ్చట కాదూ? నామాట విను. నన్నే డ్పించకు"

"ఈ నక్కవినయాల కేం లెండి. నాతిక్క మీకు తెలిసిందే. వంటచేస్తారా, పొడుంకాయ నాచేతి కిస్తారా? రెండే పద్ధతులు"

"తప్పదూ?"

"ఊహుఁ"

"అయితే పొడుంకాయ పుచ్చుకో"

"తెండి"

"నువ్వు వంట చేశాటప్పటికి నేను చెరువుకి వెళ్లి సంధ్యావందనం—"

"కట్టిపెట్టండి. గుమ్మం కదలడానికి వల్ల కాదు. వీధిగుమ్మంకూడా తొక్కి చూడనివ్వను. మడి కట్టుకున్న తరవాత చేసుకోవచ్చు జపా లన్నీనీ"

"అంత అనుమానం—"

"అనుమానం కాకపోతే యే మనుకున్నారూ? కదిలే రంటే మాట దక్కదు"

"సరే మరీ. వంట అయినాక యిస్తావా పొడుం కాయా?"

"భోజనా లయితే గాని యివ్వను"

"ప్రాణాలు కొరికేశా వన్నమాట. అయితే మరి కానియ్యి"

"వూరికే కూచోడం యెందుకూ? దొండపాదుకి నాలుగు బిందెల నీళ్ళు పొయ్యండి"

"..........."

"లేవ రేం? నీళ్ళు పోస్తేనే వ్రతం చెడదు"

"తోడతానులే. నువ్వు వెళ్లి మడికట్టుకో"

"ఇంటోకి రండి తలుపు వేస్తాను"

"కోపం వస్తే వొళ్ళు తెలవదు. పట్టు వొస్తే ముందూ వెనకా చూడవు. తోచినంత పనీ చేసి తీర తావు. ఈ కళంకం వొక్కటే లేకపోతేనా—మరి నీ యిష్టప్రకారమే నడుచుకుంటాను పద"

"అలా దారికి రండి"

౧౦

"ఈ పూటేనా యేమేనా చెయ్యకపోతే తినడం యెలాగో చెప్పు నువ్వు"

"చెయ్య డానికి తీరుబడి యేదీ? దీపాలుపెట్టే దాకా మడికట్టుకోవడం యెవరో తేలకపోయె. అన్నం వార్చేటప్పటి కింత రాత్రయింది. ఏ కూరేనా చేద్దా మంటే—"

"పెసరపప్పు పచ్చడేనా చెయ్యరాదూ?"

"లేందే"

"కందిపప్పో?"

"ఎంతసేపటికీ నలగదు బాబూ"

"పోనీ మజ్జిగేనా పోగచకూడదూ?"

"నిన్న నయింది కాదూ?"

"ఇప్పు డేం తిన మంటావో చెప్పు కోప్పడక"

"వింటారా?"

"..........."

"చెప్ప మని మిడుతూ మిడుతూ అలా చూస్తా రేం మరీ? ఆ త్తేరీ యిలా చెప్పడమే మని యెగిరిపడక బాగా ఆలోచించుకోండి"

"................"

"ఝాము రాత్రయింది. సగం వూరు మాటుమ ణిగిం దప్పుడే. ఇక మీరు వీధిలోకి వెళ్లనూ వెళ్లరు. మన యింటి కెవరూ రానూరారూ. ఇంతట్లో అమాం తంగా బ్రాహ్మణ్యం పోదు. కాస్త పులుసు—"

"ఉల్లిపాయల పులుసే?"

"చేదా? ఏప్పుడూ రానంత రుచి వచ్చిం దివాళ. జిహ్వ నెందుకు చంపుకుంటారూ? నాలుగు తమలపాకు లిస్తాను వేసుకోండి యివాళకి. గప్‌చిప్. తెల్లారేటప్పటికి యేమీ వుండదు. నామాట వినండి"

"................"

"ఏమంటారు? వెయ్యనా?"

"ముందు పీక పిసికేసి తరవాత వెయ్యి"

"ఎంత సరసంగా వుం దీమాటా? తింటే తినండి లేకపోతే మానండి. నన్నేం వుద్ధరిస్తారా? చెప్పినకొద్దీ మరీనీ. నాకోటీ మీకోటీ నేను చెయ్యలేను. దిక్కు మాలిన వ్రతాలు పట్టి కడుపు కాల్చుకోవడం నాచేత కాదు. చల్లేనా కావాలా అక్కర్లేదా? పొద్దున్న పద కొండింటికి తిన్న మెతుకులు. నాకాక లేస్తోంది. తొర గా తెమల్చండి"

"పొద్దున్న మూడు అరటిపళ్లు తెచ్చాను. అవ్వే నా పడెయ్యి విస్తట్లో"

"కూచున్నాయి"

"ఏం చేశావూ?"

"మూడుగంటల వేళ కడుపులో చురచుర లాడితే అబ్బాయీ నేనూ నోట్లో వేసుకున్నాం. అట్టే పెట్టమని చెప్పలేకపోయారూ మరీ?

"పెరుగుందా?"

"ఇందాకా అబ్బాయికి వడ్డిస్తూ వుంటే అంట చెయ్యి తగిలింది"

"పోనీ పాలు పట్టుకురా"

"ఇంకా దాలి మీద పెట్టలేదు. పచ్చివి పని కొస్తాయా?"

"యింతసేపటిదాకా యెందుకు పెట్టావు కాదూ?"

"కారణం చెబితే మాత్రం యిప్పుడు మీకు పాలు వస్తాయా?"

"పోనీ చల్ల పుల్లగా వుంటుం దేమో నిమ్మ కాయేనా అట్టెపెట్టావా?"

"వుపాస్మలోకే చాలింది కామా"

"ఎందుకు చేశావూ వుపాస్మ?"

"సుందరంగారియింట్లోవున్నన్నాళ్లూ పొద్దున్నా మధ్యాహ్నం కూడా కాఫీవుపాస్మలు పుచ్చుకొని అతను వొస్తే వూరికే పంపనా?"

"ఎంతసేపూ నువ్వూ నీవాళ్లేగాని నామాట చూడనక్కర్లేదూ?"

"మేం యేదిపడితే అది తింటాం. అంచేత మా కన్నీ వస్తాయి. నేనమ్మా మహా చదివి గుట్టలు పెట్టానని అది పనికిరా దిది వల్లకా దని ముక్కు మూసుకు కూచుంటే మీ కెలా వస్తాయీ? పైగా యేమీ— అన్నమేనా సరిగా పెట్టడం లేదని నన్ను యాగీ చెయ్యడమా? ఏదీ, నేను చేసిన వన్నీ తినండీ. మీ కేమేనా లోటు జరుగుతుం దేమోనూ"

"మాలకూడు తిన మంటావా?"

"వుల్లిపాయ మాలకూడా. బంగాళాదుంపలు కిరస్తానీవాళ్ల వా? కేబేజీ చెడిపోయిందా? గోంగూర పచ్చడిలో లెక్క రెండు వెల్లుల్లిరేకలు పడేస్తే బ్రాహ్మ ణ్యం బుగ్గయిపోతుందా? వుపాస్మ తింటే దేవతార్చన డెక్కడుతుందా? కాఫీ పుచ్చుకుంటే జంధ్యాలు మైలడి పోతాయా? దిక్కుమాలిన ఆవుపేడ ముట్టుకోలేక విస్త రంటలు తీసినచో పసుపునీళ్లతో కడిగితే అనాచారమా?

"నీకు పుణ్యంవుంటుంది కాని మాట్లాడక చల్లేనా మరికాస్త పొయ్యి"

"మరి కాస్త కాకపోతే అంతా పోసుకోండీ. మా నాన్న ధర్మమా అని నిక్షేపం లాటి గేదివుంది కదా?"

"పూటకి మా నెడుపాలకి తక్కువ యివ్వదు పాపం. నాకుమాత్రం ప్రతీపూటా పెరుగు—"

"పాలికాపాడు గుగ్గిళ్ళు వేసి దానికి పెట్టడానికి వల్లకాకపోయె. ఎక్కడ చావనండీ?"

"వాడిచేత వేయించడం మానేవా?"

"మీరు చెప్పినట్లల్లా వింటే మట్టి కొట్టుకు పోవాలి. మజ్జిగ చాలా, యింకాస్త పొయ్యనా?"

"గిన్ని యిక్కడ పెట్టు"

"అలాగే పెడతాను పోసుకోండి. నా కాకలి దహించుకు పోతోంది. వడ్డించుకుంటాను బాబు నేనూ"

"ముప్పైవ్యేళ్లు నిండాయి. ఇంకాకంచం పెట్టుకు తగులడాలా?"

"పింగాళీ పళ్లా లింతకంటే బాగుంటాయి,ఎప్పటి కప్పుడే మరిచిపోతున్నాను. ఈ మాటు సుందరం చేత తెప్పించుకోవాలి"

"దొరసానిలాగ సిగరెట్టుకూడా కాల్చు"

"మీ పొడుం కంటేనూ తప్పా అదీ?"

౧౧

"ఏవీ యిందాకా తమలపాకు లిస్తా నన్నావు లెక్క అయిదాకులూ వొక చెక్కా తెచ్చిపెట్టూ"

"పులుసు వేసుకుంటే యిస్తా నన్నాను కాని తీరి కూచుంటేనా?"

"పులుసుకీ తాంబూలానికీ సంబంధం యేమిటివి?"

"అంతానూ. కాకపోతే మాత్రం ద్వాదశిపూటా తాంబూలం యేమిటీ మీకూ?"

"పగలు రెండు ఝాములకే వెళ్లిపోయింది ద్వాదశి"

"పంచాంగం చూసుకుని వచ్చారు కామోసు సిద్ధంగాను. మీ బ్రాహ్మణ్యం పాడుచేసిన పాపం నా కెందుకూ? ఇక అమావాస్య వెళ్లాకే మీకు తాంబూ లాలు. ఆకు లెన్నో లేవు బాబూ ఇవాళ. మీ కిస్తే సుందరంగారి యింటికి వెళ్లేదాకా నాకు చాలవు"

"నాకు లేకుండా నీకు రోజూ తాంబూలం యేమిటీ?"

"మీ పాదముకీ నా తాంబూలానికీ చెల్లూ"

"ఏడిసినట్టుగానే వుంది. తాంబూలం తెమ్మంటే దున్నపోతులాగ అలా పడుకుంటావేం?"

"తెల్లవార్లూ కూచుని తిట్టుకోండి"

"అబ్బాయిని వుయ్యాలలో పడుకోబెట్టావా యేమిటే?"

" ఎక్కడైతే యేమీ? నాకు నిద్ర వొస్తోంది నన్ను మాట్లాడించకండీ యింక"

"ఏం యివాళ యింత పెందలాడే నిద్రా?"

"ప-గ-లు-ని-ద్ర-పో-లే-న్"

ప్రత్యక్ష లీల

విద్వాన్ కోపల్లె శివకామేశ్వరరావు గారు

నీ పదభక్తి కంటకవనీ పథిఁ గ్రొనరించునో సుమ
ప్రాపకమౌనో యెంతటి త్వరన్ నినువేఁడిన నేమి తెల్ప క
ట్లా పరువంపుఁ జిర్నగవులందలి మాధురి కానఁగొల్పు దా
హా! పరువెత్తనేర నిఁక నామృగతృష్ణలవెంట మానినీ!

దీనతావార్ధి తితీర్షులకీ మణిసేతువు మార్గసంధాత యగును
దృష్టాంతమోబిభిదిషుల కీచాంద్రమస జ్యోత్స్న నిస్త్రింశసరణిఁ దాల్చు
నీహాతపన విసహిష్ణుల కీయంబుజము శిశిరశిశిరచ్ఛాయ లొసఁగు
నార్తమారాత్రి జిహాసుల కీసహస్రమయూఖుఁ డుదయ భాస్వరతఁ గూర్చు
ననుచు భవదీయ మృదులపాద నఖమణి మ-యూఖశీతలచ్ఛాయామోద యోప బృంహి
త సుఖసేవాపరత దరిద్రాణ దుఃఖుఁ-డ నగు దంచుఁ దలఁపఁ గన్పడ విది తగునొ.

అదియేమో యటులున్ దిరస్కరణ విద్యానైల్యమున్ జూపుచు
న్నది నీహాసవిలాస; మంబువులిటుల్ హాలాహలంబౌనొ; యిం
త దురంతవ్యథ నిక్కమున్నదొ భవద్దాస్యంబునన్ గోర్కె చి
చ్చెదఁదాఁగొల్పఁగ నొక్క కన్పడెదు; నీ యాలీల కర్థంబెదొ.